క్లుప్తంగా

ఆయుర్వేద ఆసుపత్రికి కుర్చీల అందజేత

నిడదవోలు: స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రికి మాజీ కౌన్సిలర్ మడగల గణపతి జ్ఞాపకార్థం ఆమె భార్య ఈశ్వరి 30 కుర్చీలను విరాళంగా అందజేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ద్వారా ఆమె ఈ వితరణ చేశారు. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, వార్డు కౌన్సిలర్ పడాల శిరీష, ఈట శ్రీవిద్య, పోలదాసు శ్రీనివాసరావు, గుంటుపల్లి శివకుమార్, కాళ్ల రాంబాబు, గొన్నాబత్తుల రామారావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘ నూతన కార్యవర్గం

దేవరపల్లి: పంచాయతీ కార్యదర్శుల సంఘ మండల శాఖ నూతన కార్యవర్గం ఏర్పడింది. దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మండల పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎ.అమ్మిరాజు, ఉపాధ్యక్షుడిగా బి.రామచంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా చదలవాడ జీవన్, కోశాధికారిగా ఎస్‌డీ ఇమ్రాన్ ఎన్నికయ్యారు. సభ్యులుగా ఎం.రాణి, కె.శ్రీనివాస్, ఎండీ అజద్ ఆలీ, కె.రాజశేఖర్, ఎస్‌కే షరీఫ్ ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి, ఎంపీడీఓ డీబీఎస్ కృష్ణంరాజు తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కొవ్వూరు: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జేబీటీ సుందరీదేవి అన్నారు. పట్టణంలోని ఏబీఎన్ అండ్ పీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ర్యాంగింగ్‌కి పాల్పడితే కఠిన శిక్షలు ఉన్నాయని హెచ్చరించారు. ర్యాంగింగ్ జోలికి వెళ్లి విద్యార్థులు తమ భవిష్యత్తును పాడు చేసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ వంటి జోలికి పోవద్దని హితవు పలికారు. న్యాయవాదులు వై.ప్రకాశరావు, పీవీఆర్ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌వీ సుబ్బారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై విచారణ

దేవరపల్లి: మండలంలో పెండింగ్‌లో ఉన్న కేసులపై మండల స్థాయి కమిటీ(ఎంఎల్‌సీసీ) శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విచారణ జరిపింది. జీటీఎంఎస్ నంబరు 84ను అనుసరించి సుమోటోగా మూడు దరఖాస్తులు స్వీకరించినట్టు తహసీల్దార్ ఎం.రామకృష్ణ తెలిపారు. దరఖాస్తులపై మండల స్థాయి కమిటీలో తహసీల్దార్, సభ్యులు ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, ఎస్సై కె.శ్రీహరిరావు, గ్రామస్థాయి అధికారులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. స్వీకరించిన మూడు దరఖాస్తుదారుల్లో ఉభయులను విచారించగా, రెండు దరఖాస్తులు కుటుంబ తగాదాల ప్రవేట్ ప్రాపర్టీకి సంబంధించినవి కాగా, ఒకటి భూ ఆక్రమణ అని తేలిందన్నారు. మండల పరిషత్, రెవెన్యూ, పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులపై నెలకు ఒక రోజు మండల స్థాయి కమిటీ విచారణ నిర్వహించి పరిష్కరిస్తుందని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు.

ట్రాఫిక్ సిగ్నల్స్‌పై విద్యార్థినులకు అవగాహన

ద్వారకాతిరుమల: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులకు ద్వారకాతిరుమల సచివాలయం-2 మహిళా సంరక్షణ కార్యదర్శి పి.లక్ష్మీ సుజన ట్రాఫిక్ సిగ్నల్స్‌పై శనివారం అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలను నడపడం వల్ల, ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించడం వల్ల జరిగే ప్రమాదాలను వివరించారు. అలాగే మోటార్ వెహికల్ చట్టం ప్రకారం విధించే జరిమానాలు, శిక్షల గురించి తెలిపారు. ఏటా రోడ్డు ప్రమాదాల్లో లక్షలాది మంది మృత్యువాత పడుతున్నారని, వాటి వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆమె అన్నారు. నిబంధనలను సక్రమంగా పాటిస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. వాహనం నడిపే వారు డ్రైవింగ్ లైసెన్స్, సి సర్టిఫికెట్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. బైక్ నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బి.రాణి, వైస్ ప్రిన్సిపాల్ పి.విజయభారతి, కె.సుజయ, డి.విప్లవ కుమారి, ఎం.మెహర్ జ్యోతి, బి.శ్రీదేవి, సీహెచ్ వెరోనిక, సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్బరాజు నియామకంపై హర్షం

కొవ్వూరు: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి సభ్యుడిగా గాదిరాజు వెంకట సుబ్బరాజు నియామకంపై వైఎస్సార్ సీపీ కొవ్వూరు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా నిడమర్రు మండలం మందలపర్రుకు చెందిన సుబ్బరాజు ప్రస్తుతం వైఎస్సార్ సీపీ రాజోలు నియోజకవర్గ పరిశీలకుడిగా పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. శనివారం పలువురు నాయకులు సుబ్బరాజును కలిసి అభినందనలు తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి ముదునూరి సూర్యనారాయణ రాజు, జిల్లా స్టీరింగ్ కమిటీ మాజీ సభ్యులు పేరిచెర్ల సత్యనారాయణరాజు, దొమ్మేరు సొసైటీ మాజీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు (అబ్బులు), నాయకులు గంధం శేష సాయి, కొఠారు రామకృష్ణ, కనుమూరి అబ్బాయి రాజ తదితరులు అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.

సచివాలయాల్లో ఆధార్

- చిరునామాలో మార్పులు, చేర్పులకు అవకాశం
- వేలిముద్రలు, ఫోన్ నంబర్ల అనుసంధానం
- కార్డు పొంది పదేళ్లు పైబడితే అప్‌డేట్ తప్పనిసరి
- డివిజన్‌లో 1,59,269 మంది ఆధార్ అప్‌డేషన్ పెండింగ్



సచివాలయంలో ఆధార్ కోసం వివరాలు నమోదు చేస్తున్న దృశ్యం

కొవ్వూరు: దేశంలోని ప్రతి పౌరుడికీ ఆధార్ నంబర్ తప్పనిసరి. ప్రభుత్వం నుంచి అందే అన్ని సంక్షేమ పథకాలకు ఈ నంబర్ ఉండాల్సిందే. అలాగే ప్రతి పనికీ ఆధార్ నంబర్‌ను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. అయితే తొలిసారిగా పౌరులకు ఆధార్ కార్డు మంజూరు చేసి 2010–2016 మధ్య కాలంలో అన్నిరకాల పత్రాలు లేకుండానే ఆ కార్డులను జారీ చేశారు. దీంతో బోగస్ ఆధార్ కార్డులు పుట్టుకొచ్చాయి. వాటిని ఏరివేసే ప్రక్రియలో భాగంగా ఆధార్ కార్డు కలిగిన పౌరులందరూ విధిగా తమ పేరు, చిరునామా, సరైన ఆధారాలతో ధ్రువీకరించుకోవాలి. అలాగే ఆధార్ నంబర్ తీసుకుని పదేళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ తమ కార్డుల్లోని వివరాలను అప్‌డేట్ చేయించుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. అలా నవీకరించుకోని వారి ఆధార్ కార్డులను ఈ ఏడాది సెప్టెంబర్ తర్వాత నిలిపి వేస్తామని కూడా కేంద్రం ప్రకటించింది. అలాగే ఆధార్ కార్డు పొందిన ఐదు నుంచి ఏడేళ్ల లోపు పిల్లలు మళ్లీ అప్‌డేషన్ చేయించుకోవాలి. ఇందుకోసం కొవ్వూరు డివిజన్ పరిధిలో 22 చోట్ల శాశ్వత ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటికి తోడు నెలవారీగా ఎంపిక చేసిన సచివాలయాల్లోనూ ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నారు. గత నెలాఖరు నాటికి గోపాలపురం, నిడదవోలు, కొవ్వూరు మూడు నియోజకవర్గాల పరిధిలో 1,59,269 మంది ఆధార్ అప్‌డేషన్ పెండింగ్‌లో ఉంది.

డివిజన్‌లో 22 సచివాలయాల్లో..

కొవ్వూరు డివిజన్‌లోని 22 సచివాలయాల్లో ఆధార్ నమోదు శాశ్వత సెంటర్లు నడుస్తున్నాయి. వాటిలో నల్లజర్ల మండలంలోని నల్లజర్ల-1, ఘంటావారి గూడెం, పోతవరం-2, అనంతపల్లి-2, ప్రకాశరావు పాలెం సచివాలయాల్లోను ఆధార్ కేంద్రాలున్నాయి.కొవ్వూరు పురపాలక సంఘం పరిధిలో ఔరంగాబాద్, రూరల్‌లో కాపవరంలోను ఈ కేంద్రాలున్నాయి. దేవరపల్లి మండలంలోని చిన్నాయిగూడెం-1లోను, తాళ్లపూడి మండలంలోని మలకపల్లి, అన్నదేవర పేట-1, తాళ్లపూడి-1 సచివాలయాల్లోనూ ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గోపాలపురం-3లోను, పెరవలి మండలంలోని ఖండవల్లిలోను, చాగల్లు మండలంలోని చాగల్లు-2, ఊనగట్ల-2లోను, నిడదవోలు మండలంలోని తాడిమళ్ల-2, సమిశ్రగూడెం-1, సింగవరం సచివాలయాల్లోను ఈ కేంద్రాలు నడుస్తున్నాయి. అలాగే ఉండ్రాజవరం మండలంలో ఉండ్రాజవరం-1, వెలివెన్ను-1, వడ్లూరు, సత్యవాడ సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు పనిచేస్తున్నాయి. వాటితో పాటు ఈనెల 22 నుంచి వరుసగా 25వ తేదీ వరకూ సచివాయాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ ప్రక్రియపై మండలాల్లో ఎంపీడీవోలకు, పురపాలక సంఘాల్లో కమిషనర్‌లకు పర్యవేక్షణ బాధ్యత అప్పగించారు.

అప్‌డేట్ ఎందుకు చేసుకోవాలంటే..

- జిల్లాల పునర్విభజన నేపథ్యంలో ఇప్పుడు కొత్త జిల్లా, కొత్త చిరునామాలతో కొత్త కార్డు జారీ చేస్తారు.
- ఆధార్ నంబర్ సస్పెండ్ అయితే ఆధార్ లింక్ అయిన మొత్తం అన్ని సేవలూ నిలిచి పోతాయి. బ్యాంకింగ్, పోస్టల్, గ్యాస్ వంటి సర్వీసులు ఆగిపోతాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందే అన్ని రకాల సంక్షేమ పథకాల లబ్ధి సైతం నిలిచిపోతాయి.
- ఆధార్ కార్డులో చిరునామా, ప్రస్తుత చిరునామా వేర్వేరుగా ఉంటే సరైన ఆధారాలు చూపించి మార్పించుకోవచ్చు.
- వివాహానికి ముందు మహిళలు ఆధార్ కార్డులో పుట్టింటి వారి పేరుతో ఉంటాయి. వివాహం అయిన మహిళలు భర్త ఇంటి పేరుతో ఆధార్ కార్డు కొత్తగా తీసుకోవాలంటే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మ్యారేజ్ సర్టిఫికెట్ సమర్పించాలి.

ఎంపిక చేసిన సచివాలయాల్లో..



ప్రజలకు మరింత సౌలభ్యంగా ఉండేందుకు ప్రతి నెలా ఎంపిక చేసిన సచివాలయాల్లోనూ ప్రత్యేక ఆధార్ అప్‌డేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. పిల్లలు ఐదేళ్ల పైబడ్డ సమయంలో ఒకసారి, 15 ఏళ్లు పైబడిన తర్వాత మరోసారి అప్‌డేషన్ చేయించుకోవాలి.

– శాంతామణి, డివిజనల్ అభివృద్ధి అధికారి, కొవ్వూరు

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పలు రకాల సేవలు



వృద్ధులకు చీరలు పంపిణీ చేసిన వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ పాలకుర్తి గాయత్రి తదితరులు

నిడదవోలు: వాసవీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ సామాజిక సేవలను ఆ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ పాలకుర్తి గాయత్రి కొనియాడారు. వాసవీ క్లబ్ నిడదవోలు శాఖ విజిట్‌లో భాగంగా ఆ క్లబ్ సభ్యుల ఆర్థిక సహాయం రూ.4 లక్షలతో శనివారం పట్టణంలో 63 సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రాయిపేటలోని రమా పబ్లిక్ స్కూల్లో ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. పట్టణంలోని వివిధ దేవాలయాలు, వృద్ధాశ్రయాలు, మానసిక దివ్యాంగుల కేంద్రానికి అవసరమైన సామాన్లను అందజేశారు. సీసీ కెమెరాల నిర్వహణకు వీలుగా పట్టణ పోలీస్ స్టేషన్‌కు 65 అంగుళాల టీవీని అందించారు. అక్కడ మరిన్ని సీసీ కెమెరాలు అవసరమని పోలీసులు కోరగా వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ నుంచి మూడు సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.30 వేల చెక్కును పట్టణ ఎస్సై పి.నాగరాజుకు అందించారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ మడిపల్లి భాస్కరరావు, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ మానేపల్లి నాగేశ్వరరావు, క్లబ్ ప్రెసిడెంట్ కోట శివ రామకృష్ణ, చక్క రవికుమార్, ఇ.గుప్తా, ప్రోగ్రాం చైర్మన్ ఆలమూరి రాజశేఖర్, క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు , వైస్ గవర్నర్ కేదారిశెట్టి రవికుమార్, రీజియన్ చైర్మన్ మానేపల్లి వెంకటరమణ పాల్గొన్నారు.

సమస్యలుంటే చెప్పండి పరిష్కరిస్తాం

- హోం మంత్రి తానేటి వనిత
- చాగల్లులో గడప గడపకూ..



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి తానేటి వనిత

చాగల్లు: గడప గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. 127వ రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం ఆమె చాగల్లులో నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి ఆమె గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను, అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తనకు తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు తన దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కాగా గడప గడపకూ కార్యక్రమం ప్రారంభమైన కాసేపటికే చిన్నగా వర్షం మొదలై క్రమంగా పెరిగింది. జోరు వానలో కూడా మంత్రి వనిత కార్యక్రమం నిర్వహించడం గమనార్హం. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, చెల్లింకుల శ్రీవిజయ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంద్రోతు సురేంద్రకుమార్, మండల గౌరవాధ్యక్ష, అధ్యక్షులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, చాగల్లు సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, ముళ్లపూడి ఉదయ్‌భాస్కర్, సొసైటీ అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- సంగాయగూడెం లే అవుట్ సందర్శన



సంగాయగూడెం లే అవుట్‌లో గృహానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: జగనన్న లే అవుట్లలో గృహ నిర్మాణాలు వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అధికారులను ఆదేశించారు. సంగాయగూడెంలోని జగనన్న కాలనీలో శనివారం ఆయన సందర్శించారు. ఇక్కడి గృహనిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. కాలనీలో నీరు, రోడ్లు, విద్యుత్తు సదుపాయం కల్పించాలని వారు ఎమ్మెల్యే వెంకట్రావును కోరారు. గృహ నిర్మాణాలకు వీలుగా పంచాయతీ పైపు లైన్ నుంచి శనివారం సాయంత్రానికి నీటి సదుపాయం కల్పించాలని కార్యదర్శి అమ్మిరాజును ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదేశించారు. విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేసి, సర్వీసు ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. 2024 జనవరిలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో గృహ ప్రవేశాలు జరగాలన్నారు. అందుకోసం కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. నియోజకర్గంలోని నాలుగు మండలాల్లో జగనన్న లే అవుట్లలో నీటి వసతికి 70 బోర్లు వేస్తున్నట్టు వెంకట్రావు తెలిపారు. కాలనీలోని రెండు గృహాలకు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీటీసీ సభ్యురాలు సుంకవల్లి చిన వెంకటరమణ, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సుంకవల్లి శ్రీనివాస్, పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, పార్టీ నేతలు మేడిబోయిన గంగరాజు, కుసులూరి వెంకట సతీష్, ఆచంట సురేష్, హౌసింగ్ డీఈఈ టి.శేఖర్‌బాబు, ఏఈ ధర్మారావు పాల్గొన్నారు.

సేవామూర్తి మదర్ థెరిసాకు నివాళి



సమిశ్రగూడెంలో మదర్ థెరిసా విగ్రహానికి నివాళులర్పిస్తున్న యూత్ సభ్యులు

కొవ్వూరు: మానవతావాది, సేవామూర్తి మదర థెరిసా జయంతిని శనివారం మూడు నియోజకవర్గాల్లోని వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ కొవ్వూరు శాఖ ఆధ్వర్యంలో స్థానిక విజయవిహార్ సెంటర్లోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు ఆర్పించారు. క్లబ్ అధ్యక్షుడు కలగర వెంకట్రావు, కార్యదర్శి పెనుమాక జయరాజు, కోశాధికారి ఉప్పులూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు, ఇతర నాయకులు మదర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి ఆర్పించారు..

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెంలోని శాంతి సెంటర్లో బాబూ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో మదర్ థెరిసా జయంతిని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ గ్రామ, సొసైటీ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు మదర్ థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మెరిపే సత్తిరాజు, నూతంగి కార్తీక్, దేశాబత్తుల నాగు, వడల అంబేడ్కర్ పాల్గొన్నారు.

నల్లజర్ల: లయన్స్ క్లబ్ దూబచర్ల శాఖ ఆధ్వర్యంలో ఆ గ్రామంలోని సంఘమిత్ర స్కూల్ ఆవరణలోని థెరిసా విగ్రహానికి వ్యవసాయ శాఖ రిటైర్డు ఏడీ ముళ్లపూడి హరిశ్చంద్రరావు పూలమాల వేసి నివాళులర్పించారు.లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జోన్ చైర్మన్ వి.వరప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు.క్లబ్ అధ్యక్షుడు కెల్లా వాసు, స్కూల్ డైరెక్టర్ అంబటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు భోజనం అందజేత

ద్వారకాతిరుమల: మదర్ జయంతిని పురస్కరించుకుని జంగారెడ్డిగూడెంలోని అమ్మా-నాన్న, వికలాంగుల సేవాసంస్థలోని వృద్ధులకు ద్వారకాతిరుమల శ్రీవారి దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది శనివారం భోజనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వృద్ధులు, దివ్యాంగులతో కలసి వారు భోజనం చేశారు.

ఉండ్రాజవరం: మండలంలో కాల్దారి ప్రభుత్వ పాఠశాలలో ఆదర్శ ఫ్రెండ్స్ యూత్ సర్కిల్ ఆధ్వర్యంలో మదర్ థెరిసా జయంతిని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు థెరిసా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు ఆర్పించారు.

తాళ్లపూడి: మండలంలోని రాగోలపల్లి ప్రాథమిక పాఠశాల్లో హెచ్‌ఎం డి.దుర్గారావు మదర్ థెరిసా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆమె జీవిత విశేషాలను విద్యార్థులకు ఆయన వివరించారు.

చాగల్లులో సేవా కార్యక్రమాలు

చాగల్లు: మదర్ థెరిసా సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం ఆమె జయంతి సందర్భంగా చాగల్లులో రూ. 3.50 లక్షల వ్యయంతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రూ.70 వేల వ్యయంతో ఫ్రీజర్ బాక్సును, రూ. 2 లక్షల విలువైన ఆటోను, రూ.30 వేల విలువైన మూడు ట్రై సైకిళ్లను దాతలు సేవాసమితికి అందించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షుడు పోలిశెట్టి శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ళ హరిబాబు, కరుటూరి సతీష్, కోడి చంటియ్య, వెత్సా గంగాధరం, జుట్టా గణపతి, భవిత కేంద్రం ఉపాధ్యాయుడు పి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పరిధి దాటి వైద్యం చేయవద్దు

- పీఎంపీల సంఘ రాష్ట్ర కార్యదర్శి రాజు
- నల్లజర్లలో సమావేశం



పీఎంపీల సంఘ రాష్ట్ర కార్యదర్శి వీబీటీ రాజును సత్కరిస్తున్న మండల శాఖ సభ్యులు

నల్లజర్ల: ప్రైమరీ మెడికల్ ప్రాక్టీషనర్స్ (పీఎంపీ)లు ప్రాథమిక వైద్యం తప్ప ఎప్పుడూ తమ పరిధులు దాటి రోగులకు వైద్యం చేయవద్దని పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వీబీటీ రాజు సూచించారు. నల్లజర్ల పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సోమాలమ్మ గుడి వద్ద అధ్యక్షుడు బోడిగడ్ల సీతారాముడు అధ్యక్షతన శనివారం పీఎంపీల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి రాజు తన ప్రసంగంలో సభ్యులందరూ మంచి వైద్య సేవకులుగా పేరు తెచ్చుకోవాలన్నారు. వైద్య వృత్తిలోని మెళకువలు ఆయన వివరించారు. వృత్తిలో రోగులతో ఏ విధంగా వ్యవహరించాల్లో సూచనలు చేశారు. జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎం.జయరాజన్ వివిధ అంశాలపై మాట్లాడారు. గత 25 ఏళ్లుగా రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తూ మళ్లీ ఆ పదవికి ఎన్నికైన వీబీటీ రాజును సంఘ సభ్యులు శాలువా, పూలమాలలతో సత్కరించారు.

మూడోసారి అధ్యక్షుడిగా బోడిగడ్ల

పీఎంపీ అసోసియేషన్ నల్లజర్ల మండల శాఖ అధ్యక్షుడిగా వరుసగా మూడోసారి బోడిగడ్ల సీతారాముడు ఎన్నికయ్యారు. కార్యదర్శిగా ధనుంజయరావు, ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ, కోశాధికారిగా జీవీవీ రమణ మూర్తి, సహాయకార్యదర్శిగా ఎంఎస్ఎన్ మూర్తి నియమితులయ్యారు.

అసోసియేషన్ పేరు మార్పు

ఇంతవరకూ పీఎంపీ అసోసియేషన్‌గా ఉన్న పేరును ఇకపై పారా మెడికల్ అండ్ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ అసోసియేషన్‌గా మార్పుతున్నట్టు అధ్యక్షుడు సీతారాముడు ప్రకటించారు.

మంత్రి వనితకు ‘మారిశెట్టి’ ధన్యవాదాలు



కొవ్వూరులో హోం మంత్రి వనితను మర్యాద పూర్వకంగా కలిసిన వెంకన్నబాబు, నాయకులు

తాళ్లపూడి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నియమితుడైన మండలంలోని వేగేశ్వరపురానికి చెందిన బీసీ నాయకుడు మారిశెట్టి వెంకన్నబాబు హోం మంత్రి తానేటి వనితను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల నాయకులతో కలిసి ఆయన మంత్రిని క్యాంపు కార్యాలయం వద్ద శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో తాళ్లపూడి మండల సర్పంచుల చాంబర్ అధ్యక్షుడు కొమ్మిరెడ్డి పరశురామారావు, పార్టీ జిల్లా కార్యదర్శి తోట రామకృష్ణ తదితరులు ఉన్నారు.

జిల్లా కార్యవర్గ సభ్యులుగా మహాలక్ష్మడు, పోసియ్య

ఉండ్రాజవరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులుగా మండలంలోని కాల్దారికి చెందిన బొందల మహాలక్ష్ముడు, చిలకపాడుకు చెందిన పింద్రా పోసేశ్వరరావు (పోసియ్య) నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం వారిద్దరూ విలేకరులతో మాట్లాడారు తాము ఆది నుంచి వైఎస్సార్ సీపీలో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలుగా ఉన్నామన్నారు. ఈ పదవులతో తమ బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఇచ్చిన పదవికి న్యాయం చేస్తామన్నారు. జిల్లా నూతన కమిటీలో అవకాశం కల్పించిన నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా వారిద్దరినీ జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, కాల్దారి సొసైటీ అధ్యక్షుడు అబ్బిన రాంబాబు, వైస్ ఎంపీపీ చెట్టే నవీన్, చిలకపాడు సర్పంచ్ తిరుమళ్ల సూర్యకుమారి తదితరులు అభినందించారు.

నారా లోకేష్‌పై పోలీసులకు ఫిర్యాదు



నారా లోకేష్‌పై ఎస్సై వెంకటరమణకు ఫిర్యాదు చేస్తున్న ఎంపీపీ, వైఎస్సార్ సీపీ నాయకులు

తాళ్లపూడి: పాదయాత్రలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ సిర్రా గంగారావు ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం తాళ్లపూడి ఎస్సై కె వెంకటరమణకు శనివారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. యువగళం పాదయాత్రలో లోకేష్ కార్యకర్తలను రెచ్చగొట్టేలా మాట్లాడడమే గాకుండా రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగే విధంగా వ్యవహరిస్తున్నారంటూ వారు ఎస్సైకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ దళిత నాయకులు నూతంగి సురేష్, మార్లపూడి అచ్చిబాబు, జొన్నకూటి చినబాబు, తిగిరిపల్లి నాని, ఒరిగేటి ఆశోక్, పొనుకుమాటి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పాడి గేదెల కొనుగోలుకు రుణ సహాయం

- పశుసంవర్ధక శాఖ ఏడీ మోజెస్ జాన్ వెస్లీ
- పాల ఉత్పత్తి పెంపుపై మహిళా రైతులకు అవగాహన



పాల వెల్లువపై రైతులకు అవగాహన కల్పిస్తున్న పశుసంవర్ధక శాఖ ఏడీ జాన్ మోజెస్ వెస్లీ

నల్లజర్ల: పాలవెల్లువ పథకం కింద పాడి గేదెల కొనుగోలుకు మహిళా రైతులకు డీసీసీబీ, ఇతర బ్యాంకుల నుంచి రుణ సహాయం అందిస్తామని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టరు మోజెస్ జాన్ వెస్లీ అన్నారు. పాల ఉత్పత్తి పెంపుపై మండలంలోని కవులూరు, చీపురుగూడెం గ్రామాల్లో మహిళా పాడి రైతులకు శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏడీఏ మాట్లాడుతూ ఎక్కువ పాలిచ్చే ముర్రా జాతులతో పాటు ఇతర మేలు రకం జాతి గేదెల కొనుగోలుకు రూ.లక్ష వరకూ రుణ సహాయం అందిస్తారన్నారు. పశువులకు దాణా, చాఫ్ కట్టర్ల కొనుగోలుకు మరో రూ.30 వేల రుణసాయం అందిస్తారన్నారు. అమూల్ సంస్థ సూపర్ వైజర్ వివేక్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లోనూ జగనన్న పాలవెల్లువ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఐకేపీ ఏపీఎం కె.విజయనిర్మలకుమారి మాట్లాడుతూ నల్లజర్ల మండలంలో 1250 యూనిట్ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ప్రైవేట్ డెయిరీల కంటే అమూల్ కేంద్రాల్లో పాలకు ధర ఎక్కువగా వస్తుందన్నారు. కవులూరులో సర్పంచ్ మద్దిపాటి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

రేపు మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

కొవ్వూరు: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని ఈనెల 28వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు చైర్‌పర్సన్ బావన రత్నకుమారి తెలిపారు. పట్టణంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించనున్నట్లు తెలిపారు. కావున సభ్యులందరూ విధిగా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

పెరవలి: మెనూ ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆహారాన్ని అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వనజాక్షి అన్నారు. ఖండవల్లి సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తతో శనివారం ఆమె సమావేశం నిర్వహించారు. ఐసీడీఎస్ పెరవలి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎప్పటికప్పుడు పిల్లల బరువు, ఎత్తు వంటి కొలతలు తీసుకోవాలన్నారు. ప్రతి నెలా సక్రమంగా నివేదికలు సమర్పించాలన్నారు.